సాక్షి
గుంటూరు
బుధవారం । 10 । సెప్టెంబర్ । 2025




నల్లమందు గోడౌన్‌లో తనిఖీలు

దుర్గి: బోలేపల్లి గ్రామ శివారులో ఉన్న నల్ల మందు గోడౌన్‌లో మంగళవారం గురజాల ఆర్డీఓ మురళి తనిఖీలు నిర్వహించారు. పరిసరాలను పరిశీలించారు.



పశ్చిమ డెల్టాకు నీటి విడుదల

దుగ్గిరాల: ప్రకాశం బ్యారేజ్ నుంచి 7,004 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజ్ వద్ద 12 అడుగులు నీటి మట్టం ఉంది.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 48,286 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 40,985 క్యూసెక్కులు వదులుతున్నారు.

న్యూస్‌రీల్

కొత్తరెడ్డిపాలెంలో జ్వరాలపై ఇంటింటి సర్వే



సాక్షి ఎఫెక్ట్

చేబ్రోలు: చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామంలో విషజ్వరాలపై మంగళవారం వైద్య బృందాల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహించారు. సాక్షి దినపత్రికలో కొత్తరెడ్డిపాలెంలో విష జ్వరాలు శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనికి వైద్యాధికారులు స్పందించారు. గుంటూరు మలేరియా సబ్ యూనిట్ అధికారి నరేంద్ర, సిబ్బంది, స్థానిక పీహెచ్‌సీ వైద్య సిబ్బంది 20 ప్రత్యేక బృందాల ద్వారా గ్రామం మొత్తం ఇంటింటి సర్వే నిర్వహించారు. తొమ్మిది మందికి జ్వరాలు ఉన్నట్లు గుర్తించారు. సీజనల్ వ్యాధుల వలన భయపడాల్సిన అవసరం లేదని వైద్యులు తెలిపారు. అనుమానిత లక్షణాలు ఉన్న వారిని కొత్తరెడ్డిపాలెంలోని హెల్త్ వెల్ నెస్ సెంటర్ వద్దకు సంచార వైద్య కేంద్రం వద్ద ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. వ్యాధులు ప్రబలకుండా గ్రామంలో తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రైయినేజీ వ్యవస్థ మెరుగుదలకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని పంచాయతీ అధికారులకు సూచించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ఊర్మిళాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

పది మండలాల్లో మోస్తరు వర్షం

కొరిటెపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గుంటూరు జిల్లాలో 10 మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం పడింది. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు అత్యధికంగా గుంటూరు పశ్చిమలో 25.2 మిల్లీ మీటర్లు పడగా, అత్యల్పంగా వట్టిచెరుకూరు మండలంలో 0.4 మి.మీ. కురిసింది. సగటున 5.8 మి.మీ.గా నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. దుగ్గిరాల 22.8, గుంటూరు తూర్పు 17.6, పెదకాకాని 15.2, ప్రత్తిపాడు 11, తెనాలి 4.8, కాకుమాను 4.6, మంగళగిరి 1.4, మేడికొండూరు మండలంలో 0.8 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.

గ్రామాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా పని చేయాలి



గుంటూరు ఎడ్యుకేషన్: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికను రూపొందించుకుని అమలు చేయాలని జిల్లా పరిషత్ సీఈవో వి.జ్యోతిబసు పేర్కొన్నారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన గ్రామ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిబసు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే నిధులతోపాటు గ్రామాల్లో సొంతంగా నిధులు సమకూర్చుకునే విధానాన్ని పాటించాలన్నారు. సమావేశంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలు చెందిన గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆధునిక హంగులతో సమావేశ మందిరం



గుంటూరు వెస్ట్: అత్యాధునిక హంగులతో పునర్నిర్మించిన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరాన్ని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజతో కలిసి మంగళవారం ప్రారంభించారు. దీనిని ఏపీఈడబ్ల్యూడీసీ (ఏపీ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) సంస్థ ఆధ్వర్యంలో నిర్మించారు. ఆధునిక సీట్లతోపాటు లాంగ్ టేబుల్, నూతన మైక్, ఫర్నిచర్, భారీ టీవీ తెరలు, విద్యుద్దీపాల వ్యవస్థ, నూతన ఏసీలు వంటి వసతులు కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా అధికారులతోపాటు అన్ని రకాల సమావేశాలు పూర్తి వసతులతో ఉపయోగించుకునే వెసులుబాటు ఇందులో ఉంటుందన్నారు. ఈ నెల 3వ తేదీన జేసీ ఎ.భార్గవ్ తేజ బదిలీ అయిన సంగతి తెలిసిందే. దీని నిర్మాణంలో ఆయన పాత్ర ఎంతో ఉండడంతో ఆయనతో కలిసి కలెక్టర్ మందిరాన్ని ప్రారంభించారు. డీఆర్వో షేక్ ఖాజావలి, ఏపీఈడబ్ల్యూడీసీ ఈఈ అనిల్ కుమార్, కలెక్టరేట్ ఏఓ పూర్ణచంద్రరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కర్షకుల కన్నెర్ర

రైతు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ వైఫల్యంపై వైఎస్సార్‌సీపీ పోరుబాట

కూటమి వైఫల్యాలపై కర్షకలోకం కదం తొక్కింది. వైఎస్సార్‌సీపీ పిలుపుతో 'అన్నదాత పోరు' విజయవంతమై కూటమి పాలకుల్లో వణుకు పుట్టించింది. రైతులను అష్టకష్టాలు పెడుతున్న కూటమి ప్రభుత్వం కనీసం యూరియా కూడా సరిపడా ఇవ్వలేని దుస్థితిలో ఉండటంపై వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. సర్కార్ తీరుపై అన్నదాతలు కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి మద్దతుగా నిరసన ప్రదర్శనలు చేపట్టిన వైఎస్సార్‌సీపీ నాయకులు.. అనంతరం అధికారులకు వినతిపత్రాలు కూడా సమర్పించారు.


గుంటూరులో నిర్వహించిన అన్నదాత పోరు నిరసన ర్యాలీలో రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

- రైతు కన్నీరు రాష్ట్రానికి మంచిది కాదు
- 50 వేల టన్నుల యూరియా టీడీపీ వర్గీయులకే అందజేత
- రైతులపై కక్ష సాధిస్తున్న కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు
- 'అన్నదాత పోరు' కార్యక్రమానికి విశేష స్పందన

గుంటూరు వెస్ట్: ప్రజలకు అన్నం పెట్టే రైతన్నను ఇబ్బంది పెడితే రాష్ట్రానికి మంచిది కాదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అంబటి రాంబాబు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమీపంలో అన్నదాత పోరు కార్యక్రమానికి విశేషంగా జనం తరలివచ్చారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో పార్టీ శ్రేణులు, రైతులు హోరెత్తించారు. కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు పోలీసులు చేసిన ప్రయత్నాలను నాయకులు, కార్యకర్తలు అధిగమించారు. హుందాగా వ్యవహరించిన తీరు అధికారులను సైతం ఆశ్చర్యపరచింది. కార్యక్రమంలో బాధిత రైతులు పెద్ద ఎత్తున పాల్గొని తమ ఇబ్బందులను విలేకరులకు వివరించారు. వినతిపత్రం తీసుకోవాల్సిన ఆర్డీఓ కె.శ్రీనివాసరావు అందుబాటులో లేకుండా పోయారు. చివరకు ఇన్‌చార్జి ఏఓ రమేష్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు.

రైతులపై అంత కక్ష ఎందుకు?

ఈ సందర్భంగా అంబటి రాంబాబు విలేకరులతో మాట్లాడుతూ... రైతులు పంటల సాగు కోసం యూరియా అడుగుతుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి వారి అరెస్టుకు ఆదేశాలిస్తున్న తీరు బాధగా ఉందన్నారు. వ్యవసాయం తప్పితే మరో ప్రపంచం తెలియని రైతులపై ఎందుకు ప్రభుత్వం కక్ష కడుతుందో అర్థం కావడం లేదన్నారు. యూరియా పంపిణీ ఇవ్వక.. పంటలకు గిట్టుబాటు కల్పించక ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఇలా అయితే రైతులు ఏం చేయాలి, ఎలా జీవించాలని ప్రశ్నించారు. 40 శాతానికి పైగా ప్రజలు తమకు ఓట్లు వేశారని, రైతు పక్షపాతిగా ముద్రపడ్డ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతుకు మద్దతుగా పోరుబాట పడితే ప్రభుత్వం ఓర్చుకోలేకపోతోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా సరిపడా ఎరువులు, విత్తనాలు, పంటల బీమా, రైతు భరోసా అందించినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అన్ని వర్గాలపైనా కక్ష సాధింపే కనిపిస్తోందని విమర్శించారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు తమ వసూళ్ల కోసమే తప్ప ప్రజల బాగోగులు చూసే సమయం లేకుండా పోయిందన్నారు. సుగాలి ప్రీతి కేసు, తురకపాలెం అకాల మరణాల విషయంలో తమ పార్టీ చేసిన పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం స్పందించిందని తెలిపారు.

50 వేల టన్నులు ఎలా వచ్చింది?

అంబటి మాట్లాడుతూ నిన్న మొన్నటి వరకు రాష్ట్రంలో యూరియా కొరత లేదని ధాంబికాలు పలికిన చంద్రబాబు ఇప్పుడు కేంద్రం నుంచి ఒక్క మాటతో 50 వేల టన్నులు ఎలా తెప్పించారని ప్రశ్నించారు. అంటే యూరియా కొరత రాష్ట్రంలో ఏ స్థాయిలో ఉందో ప్రభుత్వానికి పూర్తిగా తెలుసన్నారు. వచ్చిన యూరియా సైతం టీడీపీ అనుకూల వర్గీయులకే అందుతోందని తెలిపారు. కొన్ని గ్రామాల్లో ఒక్క బస్తా కూడా రాలేదని, బ్లాక్ మార్కెట్‌లో పుష్కలంగా దొరుకుతోందని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు సైతం ప్రభుత్వ ఆదేశాలకే కట్టుబడుతున్నారని, క్షేత్రస్థాయిలో పరిశీలన చేయడం లేదన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, జిల్లా మంత్రి నాదెండ్ల మనోహర్‌లు ఒక్క గ్రామమైనా తిరిగారా అని ప్రశ్నించారు. ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత వారికి లేదా అని మండిపడ్డారు. రైతుల శ్రేయస్సు కోసం తాము నిరసన కార్యక్రమాలు చేపడితే పోలీసులతో నోటీసులు పంపిస్తూ కూటమి ప్రభుత్వం రాక్షసానందం పొందుతోందని విమర్శించారు. యూరియా ఇస్తే నిరసనలు, ధర్నాలు ఎందుకు చేస్తామన్నారు.

ఆర్థికంగానూ నష్టపోయేలా పాలన

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు పార్లమెంట్ పరిశీలకులు పోతుల మహేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కింద ప్రతి ఏడాది క్రమం తప్పకుండా నిధులు అందజేసిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలి ఏడాది ఇవ్వకుండా.. రెండో ఏడాది రూ.5 వేలు మాత్రమే ఇచ్చిందన్నారు. తాము ఇచ్చిన ఉచిత పంటల బీమా రైతుల కష్టాలను అధిగమించేట్లు చేశామన్నారు. ప్రభుత్వానికి మద్యం వ్యాపారం, వసూళ్లపై ఉన్న శ్రద్ధ కష్టపడి పనిచేసే రైతుల సమస్యల పరిష్కారంపై చూపిస్తే నేడు రోడ్లు ఎక్కాల్సిన అవసరం రాదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, గుంటూరు నగర అధ్యక్షులు నూరి ఫాతిమా, తాడికొండ, ప్రత్తిపాడు నియోజకవర్గాల సమన్వయకర్తలు వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు), బలసాని కిరణ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శులు నిమ్మకాయల రాజ నారాయణ, షేక్ మస్తాన్ వలి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మెట్టు వెంకటప్పారెడ్డి, ఏపీ కుమ్మరి, శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మండేపూడి పురుషోత్తమ్, నగర యువజన విభాగం అధ్యక్షుడు యేటి కోటేశ్వరరావు, అనుబంధ విభాగం జిల్లా అధ్యక్షుడు పఠాన్ సైదా ఖాన్, నల్లమోతు రామకృష్ణ, కొర్రపాటి ప్రేమ్ కుమార్, వాసుమల్ల విజయ్, పవన్ శేషగిరి, దానం వినోద్, ఉడుముల పిచ్చిరెడ్డి, దాసరి రాజు, కార్పొరేటర్లు అచ్చాల వెంకటరెడ్డి, పడాల సుబ్బారెడ్డి, అంబేద్కర్, అజయ్, మల్లవరపు రమ్య, గేదెల రమేష్, పోలవరపు వెంకటేశ్వర్లు, బోడపాటి కిషోర్, బత్తుల దేవానంద్, భాను, సురసాని వెంకట రెడ్డి, రజియా బేగం, పూనూని నాగేశ్వరరావు, ఓలేటి అరవింద్ రైతులు పాల్గొన్నారు.

అణగదొక్కడమే ప్రభుత్వం పని

మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకుండా ప్రతిపక్షాలను అణగదొక్కే ప్రయత్నం చేస్తోందన్నారు. తమను ఎంత అణగదొక్కితే అంతలా ఉద్యమిస్తామని చెప్పారు. దానికి తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. జిల్లాలో 100 రకాలకు పైగా పంటలు పండుతాయన్నారు. ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన మిర్చి యార్డు ఇక్కడే ఉందని గుర్తుచేశారు. పత్తి, పొగాకు వంటి పంటలకు జిల్లా ఎంతో పేరుగాంచిందన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి ఇటువైపు కూడా కన్నెత్తి చూడలేదన్నారు. అందుకే రైతుల తరపున జిల్లాలో తమ పార్టీ నిరంతర ఉద్యమాలు చేపడుతోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతుల ఇబ్బందులను ముందే గ్రహించి రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. వారికి చేదోడు వాదోడుగా ఉన్నామని తెలిపారు. అన్నదాతలను ఇంతలా వేధిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని మరో మూడేళ్లు భరించాల్సిందేనని చెప్పారు. ప్రతిపక్షాలంటే పాకిస్తాన్ ఉగ్రవాదుల్లా చూస్తున్నారని పేర్కొన్నారు. పోలీసులను తమపైకి ఉసిగొలిపి వేడుక చూస్తున్నారని పేర్కొన్నారు. విత్తనాలుండవు, గిట్టుబాటు ధర ఇవ్వరు, పంటల బీమాకు మంగళం పాడేశారన్నారు. ఈ-క్రాప్ నమోదు అంతంత మాత్రంగానే ఉందని తెలిపారు. తాము రైతుల తరపున పోరాటం చేస్తున్నామన్నారు. 2019–24 కాలంలో రైతులు ఏనాడైనా రోడ్డుపైకి వచ్చారా? అని ప్రశ్నించారు. రైతులకు న్యాయం చేస్తే తాము ధర్నాలు ఎందుకు చేస్తామని మోదుగుల పేర్కొన్నారు.

కూటమి పాలనలో ఇబ్బందులు

కార్యక్రమంలో పాల్గొన్న రైతులు యూరియా లభించక నానా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేసారు. గత ప్రభుత్వ హయాంలో చిన్న ఇబ్బంది ఉన్నా సర్కారు స్పందించి న్యాయం చేసేదని గుర్తుచేశారు. రైతు భరోసా కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల్లో చెబితే తక్షణం స్పందించేవారన్నారు. కొందరు రైతులు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు.


డీఆర్వోకు వినతి పత్రం అందిస్తున్న అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ ఏసురత్నం, మోదుగుల వేణుగోపాలరెడ్డి, పోతిన మహేష్, నూరి ఫాతిమా, వనమా బాలవజ్రబాబు, బలసాని కిరణ్‌కుమార్, రైతులు, నాయకులు

దిక్కుతోచని స్థితిలో ఉన్నా



150 ఎకరాల్లో వరి వేశా. ఎకరానికి 3 యూరియా బస్తాలు అవసరం. అంటే సుమారు 450 బస్తాలు కావాల్సి ఉండగా ఒక్కటీ అందలేదు. గత్యంతరం లేని స్థితిలో డీఏపీ వాడుతున్నాం. రాష్ట్రంలో 67 శాతానికి పైగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. రైతుల కష్టాలను వినేందుకు వ్యవసాయ శాఖ మంత్రిగానీ, అధికారులుగానీ సిద్ధంగా లేరు. ఇలాంటి విధానాలు అమలు చేస్తే భవిష్యత్తులో రైతు కనుమరుగయ్యే పరిస్థితి ఉంటుంది.

– నల్లమోతు రామకృష్ణ, రైతు, కాకుమాను

బ్లాకులో జోరుగా విక్రయాలు



జిల్లా యంత్రాగానికి, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య సమన్వయం లేదు. యూరియా గురించి పూర్తి సమాచారం చెప్పడం లేదు. వచ్చే కొద్దిపాటి బస్తాలు కూటమి నాయకుల అనుకూల వర్గీయులకు వెళుతున్నాయి. చిన్న, సన్నకారు రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. వ్యవసాయం చేయాలంటే భయమేస్తోంది. చాలా రోజుల నుంచి యూరియా కొరత గురించి చెబుతున్నా పట్టించుకోవడంలేదు. ప్రత్తిపాడు మండలంలో నాతోపాటు మా బంధువులు వ్యవసాయం చేస్తుంటారు. పంటకు యూరియా ఎంతో కీలకం. దానిని మార్కెట్‌లోకి తేవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

– కొండా కృష్ణా రెడ్డి, రైతు, ప్రత్తిపాడు

• రైతులకు కన్నీరు మిగిల్చిన కూటమి ప్రభుత్వం

- కన్నీటిలోనే పాలకులు కొట్టుకుపోవడం ఖాయం
- 'అన్నదాత పోరు'లో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ సమన్వయకర్తలు మురళీకృష్ణ, వేమారెడ్డి, శివకుమార్‌లు

తెనాలి: రైతులకు కన్నీరు మిగిల్చిన కూటమి ప్రభుత్వం వారి కన్నీటిలోనే కొట్టుకుపోతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఖరీఫ్ సాగు రైతులకు అవసరమైన యూరియాను వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రైతుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని స్పష్టం చేశారు. యూరియా దొరక్క రైతులు పడుతున్న అవస్థలపై వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు 'అన్నదాత పోరు' కార్యక్రమం మంగళవారం తెనాలిలో జరిగింది. రామలింగేశ్వరపేట నుంచి బోసు రోడ్డు మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన సాగింది. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పార్టీ నాయకులు అందజేశారు.

బాబు పాలనలో అన్నీ కష్టాలే

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంటలకు గిట్టుధరలు లేవన్నారు. రైతులు అయినకాడికి అమ్ముకోవాల్సిన దుర్భర పరిస్థితులు దాపురించాయని గుర్తుచేశారు. ప్రస్తుత ఖరీఫ్ సీజనులో అవసరమైన యూరియాను ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని చెప్పారు. వ్యవసాయం దండగ అనే అభిప్రాయం కలిగిన చంద్రబాబు పాలనలో రైతులు ఎప్పటి మాదిరిగానే అవస్థలు పడాల్సి వస్తోందన్నారు.

రైతులపాలిట శనిలా చంద్రబాబు

పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందమూరి లక్ష్మీపార్వతి మాట్లాడుతూ గతంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రైతులకు నాణ్యమైన విత్తనాలను, ఎరువులను ఇచ్చిందన్నారు. పంటలను కల్లాల్లోనే మద్దతు ధరకు కొనుగోలు చేశారని గుర్తుచేశారు. గతంలో రైతుభరోసా కింద రూ.13,500 ఇస్తే.. చంద్రబాబు వచ్చాక రూ.5 వేలు మాత్రమే ఇచ్చారని ధ్వజమెత్తారు. రైతులపాలిట చంద్రబాబు శనిలా దాపురించారని ఆరోపించారు. యూరియా దొరకటం లేదని రైతులు అల్లాడిపోతుంటే పిట్టకథలు, కట్టుకథలు చెబుతున్నారని విమర్శించారు.


తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న లేళ్ల అప్పిరెడ్డి, లక్ష్మీపార్వతి, శ్యామల, అన్నాబత్తుని శివకుమార్, అంబటి మురళీకృష్ణ, దొంతిరెడ్డి వేమారెడ్డి, మురుగుడు హనుమంతరావు


పోలీసు అధికారితో మాట్లాడుతున్న అన్నాబత్తుని శివకుమార్, అంబటి మురళీకృష్ణ

సీఎం వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం

తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దేశంలోనే ఎక్కడా లేనివిధంగా ఆర్‌బీకే కేంద్రాలను తీసుకొచ్చి సమస్త సేవలను అందించినట్లు చెప్పారు. పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేసిందన్నారు. చంద్రబాబు, లోకేష్‌లు రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. రైతులు యూరియా కోసం ఇబ్బంది పడుతుంటే... పంటకు యూరియా ఎక్కువేస్తే అనారోగ్యం వస్తుందని చంద్రబాబు, వ్యవసాయ శాఖ మంత్రి అనటం దారుణమన్నారు. పవన్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, మంత్రులు ఆయన సినిమా టికెట్ల ప్రమోషన్లలోనే మునిగితేలుతున్నారని విమర్శించారు.

'చంద్ర'గ్రహణం చీకటిలో రాష్ట్రం

వైఎస్సార్‌సీపీ మహిళా నేత శ్యామల మాట్లాడుతూ ఇటీవల పట్టిన చంద్రగ్రహణం మూడు గంటల్లో పోతే, రాష్ట్రానికి పట్టిన 'చంద్ర'గ్రహణం ఇంకా మూడున్నరేళ్లు భరించాల్సిందేనని అన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఆ గ్రహణం చీకటిలోనే మగ్గుతున్నారని చెప్పారు. యూరియా ఇచ్చామని చెబుతున్న ప్రభుత్వం.. రైతులు ఊరూరా చెప్పులు, సంచుల వరుసలు పెట్టి ఎందుకు మగ్గిపోతున్నారో వివరించాలని నిలదీశారు.

కూటమికి గుణపాఠం తప్పదు

మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ.. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రైతులు హాయిగా ఉన్నారని గుర్తుచేశారు. ప్రస్తుతం రైతుల కష్టాలు పాలకులకు పట్టటం లేదన్నారు. బఫేలో భోజనాల ప్లేట్లు పట్టుకుని నిలబడటం లేదా... యూరియా కోసం క్యూలైనులో నిల్చుంటే తప్పేముందని ఒక నాయకుడు అనటం రైతులను అవమానించినట్టేనని అన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, సరైన సమయంలో తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.

ఎకరాకు రూ.10 వేలు పరిహారం ఇవ్వాలి

పార్టీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ రైతులకు వెంటనే సరిపడా యూరియా ఇవ్వాలన్నారు. కొండవీటి వాగు ముంపుతో గుంటూరు చానల్‌కు గండ్లు పడి 30 వేల ఎకరాలలో పంట నీట మునిగినందున పొన్నూరు నియోజకవర్గంలోని రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, పార్టీ పరిశీలకుడు గులాం రసూల్, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, మూడు నియోజకవర్గాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.


తెనాలిలో నిరసన ప్రదర్శనలో పాల్గొన్న పార్టీ శ్రేణులు, రైతులు


ఎడ్లబండిపై వస్తున్న లేళ్ల అప్పిరెడ్డి, లక్ష్మీపార్వతి, శ్యామల, శివకుమార్, వేమారెడ్డి, మురళీకృష్ణ, హనుమంతరావు

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,000 గరిష్ఠం : రూ. 2,800

మోడల్ ధర రూ. 2,400

పసుపు ధరలు
(మంగళవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 375

కొమ్ములు : 243 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
10,000	10,250	10,150

కాయలు : 132 బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
10,000	10,150	10,150

మొత్తం అమ్మకాలు : 281.25 క్వింటాళ్లు

-దుగ్గిరాల

మిర్చి యార్డు సమాచారం
(మంగళవారం ధరలు)

వచ్చిన బస్తాలు	48,304
అమ్మకాలు	47,072
నిల్వ	17,845

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–14,500
నంబరు-5	10,000–13,500
341	11,000–15,400
4884	10,000–14000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–14,600
నంబరు-5	10,000–13,600
341	11,000–15,800
4884	10,000–14,200

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 15,300
బాడిగ 355	10,000 – 15,500
దేవనూరు డీలక్స్	10,000 – 14,000
ఆర్మూర్	9,800 – 12,500
తాలుకాయలు	6,200 – 8,000

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 15,400
బాడిగ 355	10,000 – 15,300
దువనూర్ డీలక్స్	10,500 – 13,600
తాలు	5,500 – 7,500

-కొరిటెపాడు (గుంటూరు)




గుంటూరు ఆర్డీవో కార్యాలయం వద్ద మంగళవారం 'అన్నదాత పోరు'లో నిరసనలో పాల్గొన్న అంబటి రాంబాబు, మోదుగుల వేణుగోపాలరెడ్డి, పోతిన మహేష్, నూరి ఫాతిమా, వనమా బాలవజ్రబాబు, బలసాని కిరణ్‌కుమార్ తదితరులు... నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు



తెనాలి సబ్ కలెక్టరేట్ సమీపంలో బారికేడ్లు అడ్డుపెట్టి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులను అడ్డుకుంటున్న పోలీసులు

అర్ధరాత్రి వేళ నోటీసుల జారీ ఏంటి?

- మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు
- రెండు రోజులు ముందు వచ్చి నోటీసులు జారీ చేయవచ్చని వ్యాఖ్య
- ఇవ్వాలనుకుంటే స్టేషన్‌కు తామే వచ్చి తీసుకుంటామని స్పష్టీకరణ



మాజీ మంత్రి అంబటి రాంబాబుకు నోటీసులు ఇస్తున్న మహిళా పోలీస్ అధికారి

నగరంపాలెం: రాష్ట్ర వ్యాప్తంగా రైతుల బాధలను తెలుసుకునేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ పిలుపుమేరకు అన్నదాత పోరు చేపట్టామని మాజీ మంత్రి, వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అన్నారు. కార్యక్రమానికి అనుమతి లేదంటూ ఓ మహిళా పోలీస్ అధికారిణి మంగళవారం గుంటూరు సిద్ధార్థనగర్‌లోని ఆయన నివాసానికి చేరుకుని నోటీసులు జారీ చేశారు. అనంతరం అంబటి మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వంపై తీవ్రమైన ఒత్తిడి తీసుకువచ్చేందుకు, ఎరువుల పంపిణీ సక్రమంగా జరిగేలా, రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో అన్నదాత పోరు చేపట్టామని అన్నారు. ఈ క్రమంలో అనుమతి కోసం లెటర్లు పెట్టామని గుర్తుచేశారు. అయితే సోమవారం అర్ధరాత్రి 12.40 గంటల సమయంలో రెండు వ్యాన్లల్లో పోలీసులు తమ ఇంటి వద్దకు వచ్చారని చెప్పారు. తలుపులు కొట్టడంతో తన భార్య, మనవరాళ్లు భయపడిపోయారని అన్నారు. అర్ధరాత్రి దాటాక పోలీసులు రావడం ఏంటని నిద్ర లేచి వచ్చానని పేర్కొన్నారు. నోటీసులు ఇచ్చేందుకు వచ్చామని పోలీసులు చెప్పారన్నారు. దీంతో ఉదయం వేళ రావాలని పోలీసులకు చెప్పానని తెలిపారు. అయినా ఇదేమి పద్ధతి అని, చట్టబద్ధమైన పరిపాలన జరుగుతున్న రాష్ట్రంలో పోలీసులు దొంగల్లా అర్ధరాత్రి రావాల్సిన అవసరం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఉదయం వేళ ఇంటికి రావచ్చునని లేదా ఆదివారం రాత్రి 8లోపు నోటీసులు జారీ చేయవచ్చునని అన్నారు. కేవలం భయభ్రాంతులకు గురిచేయాలనే పోలీసులు వచ్చారని మండిపడ్డారు. అన్నదాతల కోసం తాము పోరాటం చేస్తున్నామని, రాజకీయ లబ్ధి కోసం కానేకాదని స్పష్టం చేశారు. అణచివేయాలనే ధోరణితో పోలీసులు వ్యవహరించడం దురదృష్టకరమని ఆరోపించారు. ఒకవేళ నోటీసులు ఇవ్వాలంటే కబురు పంపితే పోలీస్‌స్టేషన్‌కు స్వయంగా వస్తానని చాలా సందర్భాల్లో చెప్పానని అంబటి గుర్తుచేశారు. అరెస్ట్ చేయాలనుకున్నా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి అరెస్ట్ అవుతానని స్పష్టం చేశారు. అర్ధరాత్రుళ్లు ఇళ్లకు రావడం ఏంటని నిలదీశారు. దొంగలు, రౌడీల్లాగా వ్యవహరించడంపై మండిపడ్డారు. తమాషాలు అనుకుంటున్నారని, గతంలో తాము కూడా రాష్ట్రాన్ని పరిపాలించామని, మంత్రిగా చేశానని గుర్తుచేశారు. చట్ట పరిధిలో విధులు నిర్వర్తించాల్సిన పోలీసులు రెండు రోజులు ముందు వచ్చి నోటీసులు జారీ చేయవచ్చుగా అని ప్రశ్నించారు.

అంబటి మురళీకృష్ణకు నోటీసు

పొన్నూరు: అన్నదాత పోరును అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. తెనాలిలోని ఓ హోటల్‌లో వైఎస్సార్‌సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణకు పోలీసులు నోటీసు ఇచ్చారు. కార్యక్రమంలో పాల్గొనవద్దని సూచించారు. అయినా ఆయనతో పాటు పలువురు నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అటు ప్రభుత్వం, ఇటు పోలీసులు పార్టీ చేపట్టిన కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు యత్నించినా నాయకులు, కార్యకర్తలు వాటిని అధిగమించి ధైర్యంగా పాల్గొన్నారు.



తెనాలిలో అంబటి మురళీకృష్ణకు నోటీసు ఇస్తున్న పోలీసు

మంగళవారం కలెక్టరేట్ సమీపాన టెంట్‌లను పోలీసులు కూల్చివేయడంపైనా మండిపడ్డారు. చంద్రబాబు, లోకేష్‌లు చెబుతున్నట్టు వింటున్న పోలీసులు తర్వాత ఇబ్బంది పడతారని హెచ్చరించారు. అనుమతిస్తే అన్నదాత తరపున పోరాటం చేస్తామని, లేదంటే పోలీసులతో పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

పోలీసుల పేరిట అణచివేత యత్నం సిగ్గుచేటు

పట్నంబజారు: అన్నదాత పోరు కార్యక్రమంలో భాగంగా గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దకు వెళ్లకుండా పోలీసులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమాకు ఆంక్షలు విధించారు. మంగళవారం అన్నదాత పోరు కార్యక్రమానికి వెళ్లడానికి వీల్లేదంటూ నోటీసులు జారీ చేశారు. 30 పోలీసు యాక్ట్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎలాంటి ప్రదర్శనలు, నిరసనలు తెలిపేందుకు అనుమతి లేదని తెలిపారు. పాతగుంటూరు పోలీసులు మంగళదాస్‌నగర్‌లోని ఆమె నివాసానికి వెళ్లి నోటీసులు అందజేశారు. సానుకూలంగా స్పందించిన నూరిఫాతిమా పోలీసుల నుంచి నోటీసులు స్వీకరించారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ.. రైతన్నల సమస్యలు పరిష్కరించలేని కూటమి ప్రభుత్వం ప్రశ్నిస్తున్న ప్రతిపక్షంపై పోలీసులను అడ్డుపెట్టుకుని అణచివేత యత్నం చేయడం సిగ్గుచేటన్నారు. రైతులు, ప్రజల పక్షాన ఎలాంటి సమస్యలు ఉన్నా పోరాడేందుకు ఏ మాత్రం వెనుకాడమన్నారు. అక్రమ కేసులు, నోటీసులు, అరెస్టులకు భయపడేది లేదని స్పష్టం చేశారు.



నూరి ఫాతిమాకు నోటీసు అందజేస్తున్న పోలీసు

తురకపాలెంలో ఎన్సీడీసీ బృందం పరిశీలన

గుంటూరు రూరల్: తురకపాలెం గ్రామాన్ని జాతీయ వ్యాధుల నియంత్రణ కేంద్రం (ఎన్సీడీసీ) ఆధ్వర్యంలో వైద్య నిపుణుల బృందం మంగళవారం సందర్శించింది. ఇన్ఫెక్షన్ కారణాలను విశ్లేషించి చేపట్టిన నియంత్రణ చర్యలను సమీక్షించినట్లు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. ఎన్సీడీసీ సంయుక్త సంచాలకులు డాక్టర్ హేమలత, డాక్టర్ ప్రవీణ్ నిపుణుల బృందం గ్రామంలోని వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తున్నారన్నారు. అవసరమైన వారికి మరిన్ని స్కానింగ్‌ల కోసం గుంటూరు జీజీహెచ్‌కు రిఫర్ చేస్తున్నారన్నారు. డాక్టర్ సిరి ఆధ్వర్యంలోని రాష్ట్ర స్థాయి నిపుణుల కమిటీ నిరంతరం గ్రామంలో పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ఆగస్టు 21 నుంచి సెప్టెంబర్ 7వ తేదీ వరకు మొత్తం 7 కేసులు నమోదు కాగా, 2 మెలియోడోసిస్ వ్యాధిగా ధ్రువీకరించినట్లు తెలిపారు. 5 అనుమానిత కేసులుగా నమోదు అయ్యాయన్నారు. వీరిలో ఆరుగురు జీజీహెచ్‌లో, ఒకరు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని వివరించారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

తాడికొండ: తుళ్లూరు మండలం మందడం గ్రామంలో పూలింగ్ ఇవ్వని తమ భూములను దౌర్జన్యం చేసి ఆక్రమించుకునేందుకు యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు పసుపులేటి జమలయ్య, కలపాల శరత్ కుమార్‌లు మంగళవారం తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఓ హోటల్ నిర్మాణం కోసం తమ భూములను అక్రమంగా చదును చేసి ఫెన్సింగ్ తొలగించారని వారు ఆరోపించారు. అడ్డుకునేందుకు వెళ్లగా దౌర్జన్యంగా నెట్టి ఆక్రమించుకున్నారని పేర్కొన్నారు. వీరితోపాటు సహకరించిన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

దుగ్గిరాల రైల్వే గేటు మరమ్మతులు పూర్తి

దుగ్గిరాల: నాలుగు రోజుల నుంచి నిరంతరాయంగా కొనసాగిన పనులు పూర్తి అవ్వడం వల్ల గేటు నుండి రాకపోకలు అనుమతించారు. మంగళవారం దుగ్గిరాల రైల్వే గేటు వద్ద మరమ్మతులు పూర్తి కావడంతోపాటు ఇంజినీరింగ్ అధికారులు ఫిట్ పర్మిషన్ ఇచ్చారు. గేటు మూసివేతతో ఇప్పటివరకు పెనుమూలి, చెన్నకేశవ నగర్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొందరు వేరే ప్రత్యామ్నాయం లేక నాలుగు రోజులుగా ద్విచక్ర వాహనాలు అక్కడే ఉంచారు. పనులు పూర్తికావడంతో ఊపిరి పీల్చుకున్నారు.

రేపు అండర్-14, 17 క్రీడా పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 బాలబాలికల క్రీడా పోటీలు గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని కార్యదర్శి గోపి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బీఆర్ స్టేడియంలో కురుష్, పెదకాకాని జెడ్పీహెచ్ఎస్ స్కూల్లో ఆర్చరీ, పల్నాడు జిల్లా నంది గామ జెడ్పీహెచ్ఎస్ స్కూల్లో చెపక్‌తక్ర విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. పాల్గొనదలచిన క్రీడాకారులు స్కూల్ గేమ్స్ అర్హత ఫామ్‌తోపాటు సంబంధిత స్కూల్ నుంచి బోనఫైడ్ సర్టిఫికెట్ తీసుకురావాలన్నారు.

13న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమావేశం

నెహ్రూనగర్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమావేశం ఈ నెల 13న గుంటూరులో నిర్వహించనున్నారు. ఈ మేరకు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదులమూడి మధుబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా శాఖల్లో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేయవచ్చన్నారు. గుంటూరు అమరావతి రోడ్డులోని భారత్‌పేటలోని మదర్ థెరిస్సా కమ్యూనిటీ హాల్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు.

16న వక్తృత్వ, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 16న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలోని వృక్ష, జంతు, రసాయనశాస్త్ర విభాగాలు సంయుక్తంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించనున్నాయి. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి.హెచ్. కామేశ్వర శాస్త్రి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి కళాశాల నుంచి ముగ్గురు విద్యార్థులు చొప్పున పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. పోస్టర్ ప్రెజెంటేషన్‌కు సంబంధించిన చార్ట్స్ నిర్వహణ కమిటీ అందజేస్తారని చెప్పారు. కలర్స్ విద్యార్థులే తెచ్చుకోవాలని సూచించారు. పోటీలలో డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఫార్మసీ విద్యార్థులు పాల్గొనవచ్చునని వివరించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న అందరికీ ప్రశంసాపత్రాలు ఇస్తామని తెలిపారు. ఇతర వివరాలకు వృక్ష శాస్త్ర విభాగాధిపతి పీఎస్ఎల్.చంద్రకళ (96761 01585), జంతు శాస్త్ర అధ్యాపకురాలు ఎస్‌కే జమ్ముర్దీన్ బేగం (94927 10525), రసాయన శాస్త్ర విభాగాధిపతి బి.జ్యోతి (89197 48023)లను సంప్రదించాలని కోరారు.

నిండు ప్రాణం తీసిన వివాదం



మణికంఠ మృతదేహం


నగరంపాలెం: ఇద్దరి మధ్య తలెత్తిన వివాదం ఓ యువకుడి నిండు ప్రాణాలను బలి తీసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు, లాలాపేట పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. సంగడిగుంట గాంధీనగర్ (ఎల్ఆర్‌కాలనీ) మూడో వీధికి చెందిన పెంట్యాల మణికంఠ (26) బీటెక్ పూర్తయింది. ప్రస్తుతం కేవీపీకాలనీలో ఉంటున్న గాంధీనగర్ వాసి యశ్వంత్ కార్లను అద్దెకిచ్చేవాడు. ఏడాది క్రితం వీరి మధ్య వివాదం నెలకొంది. సోమవారం రాత్రి వినాయక నిమజ్జన ఊరేగింపు ముగిశాక మళ్లీ గొడవ జరిగింది. మణికంఠపై యశ్వంత్ దాడికి పాల్పడ్డాడు. మణికంఠను కుటుంబ సభ్యులు, స్నేహితులు ఇంటికి తీసుకెళ్లారు. ఫోన్ కాల్‌లో మళ్లీ ఇద్దరి మధ్య వాదనలు జరిగాయి. యశ్వంత్ మరికొందరు యువకులతో వెళ్లి ఇంటి ముందు మెట్లపై కూర్చుని ఉన్న మణికంఠపై కర్రలతో విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలైన మణికంఠ కేకలు వేయగా, నిందితులు పారిపోయారు. వైద్యసేవల నిమిత్తం మణికంఠను తల్లిదండ్రులు జీజీహెచ్‌కు తరలించారు. మంగళవారం ఉదయం మణికంఠను ఆసుపత్రి నుంచి ఇంటికి తీసుకొచ్చారు. కొద్దిసేపటికే అతను స్పృహ కోల్పోయాడు. కొత్తపేట ఓల్డ్‌క్లబ్‌రోడ్డులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అతడు మృతి చెందినట్లు నిర్ధారించారు. అంబులెన్స్‌లో మృతదేహాన్ని కుటుంబసభ్యులు లాలాపేట పీఎస్ వద్దకు తీసుకొచ్చారు. తండ్రి హనుమంతురావు ఫిర్యాదుతో లాలాపేట పీఎస్ సీఐ శివప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి తల్లి వెంకటమహాలక్ష్మి స్పృహ కోల్పోయింది. హత్యకు పాల్పడిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తూర్పు సబ్ డివిజనల్ డీఎస్పీ అబ్దుల్‌అజీజ్ తెలిపారు.

'కిల్కారి' అమలు పరిశీలన



గుంటూరు మెడికల్: కిల్కారి అమలు తీరును పరిశీలించేందుకు కేంద్రం బృందం వచ్చింది. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయాన్ని మంగళవారం ఢిల్లీ నుంచి వచ్చిన బృంద సభ్యులు సందర్శించారు. జిల్లా బృందంతో సమావేశం అయ్యారు. గర్భిణులు, బాలింతలకు ఉపయోగపడుతున్న తీరు అడిగి తెలుసుకున్నారు. జిల్లా బృందం ఈ సేవలను మెరుగుపరచడానికి తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. డీపీహెచ్ఎన్ఓ డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ అమలు తీరు వివరించారు. 911 60010 3660 అనే నెంబర్ కాల్ వస్తుందని, ఈ నెంబర్ సేవ్ చేసుకోవాలన్నారు. తిరిగి వినాలి అంటే 14423 నెంబర్‌కి కాల్ చేయాలని చెప్పారు.

కళా ఉత్సవాలను విజయవంతం చేయాలి



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రత్తిపాడు మండలం బోయపాలెంలోని ఈనెల 11, 12వ తేదీల్లో నిర్వహించనున్న కళా ఉత్సవాలను జయప్రదం చేయాలని గుంటూరు, పల్నాడు జిల్లాల విద్యాశాఖాధికారులు సీవీ రేణుక, ఎల్. చంద్రకళలు తెలిపారు. మంగళవారం డీఈవో కార్యాలయంలో డీఈవో రేణుకకు నోడల్ అధికారి డాక్టర్ ఎన్. విమల కుమారి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. రేణుక మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 9, 10, 11, 12వ తరగతుల విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. విజేతలకు బహుమతులతోపాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. రెండు రోజులపాటు భోజన ఏర్పాట్లు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసీం పాల్గొన్నారు.

ట్రాన్స్‌జండర్లకు శిక్షణ

నెహ్రూనగర్: స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి కోర్సులలో ప్రవేశ ఎంపికకు ట్రాన్స్‌జండర్ల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జండర్లు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డి. దుర్గాబాయి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ లెవెల్ కోర్సులో ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, జనరల్ నాలెడ్జ్, పబ్లిక్ స్పీకింగ్, ప్రాక్టీస్ టెస్టులు ఉంటాయన్నారు. డిగ్రీ లెవెల్‌లో అడ్వాన్స్ ఆప్టిట్యూడ్, న్యూస్ పేపర్ అనాలసిస్, కంప్యూటర్ ప్రావీణ్యాలు ఉంటాయని పేర్కొన్నారు. సంబంధిత శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎన్టీఆర్ స్టేడియంలో వాకర్స్ నిరసన



లాల్ వజీర్ ఆధ్వర్యంలో నిరసన

గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియంలో వాకర్స్ ఆగ్రహించారు. మంగళవారం ఉదయం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లాల్ వజీర్ మాట్లాడుతూ ఉదయం 5 గంటలకు వాకింగ్ చేస్తున్న సమయంలో సిబ్బంది లైట్లు తీసేశారన్నారు. వర్షం కారణంగా స్టేడియం బురదగా ఉందన్నా పట్టించుకోలేదని తెలిపారు. ట్రాక్ పనులు పూర్తి చేయలేదన్నారు. మైక్ మరమ్మతులకు గురైనా పట్టించుకోవడం లేదని తెలిపారు. గ్రౌండ్ మెన్స్ కూడా లేరన్నారు. జిమ్‌లోని కొన్ని పరికరాలు ఎంతో కాలంగా పనిచేయడం లేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత స్టేడియంలో ఆటలకు బదులు రాజకీయాలు నడుస్తున్నాయని సీనియర్ సభ్యులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఇక్కడి సభ్యులను కలుపుకొని బాస్కెట్ బాల్ కోర్ట్, స్కేటింగ్ రింక్, అత్యాధునిక పరికరాలతో జిమ్, స్టేడియం సుందరీకరణ వంటి అభివృద్ధి పనులు చేపట్టారు. తర్వాత ఒక్క కొత్త పని కూడా పూర్తి చేయలేదు. ఇటీవల నూతన కమిటీ ఎన్నికలు కూడా టీడీపీలోని రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరు కారణంగానే రద్దయ్యాయి. కమిటీ వస్తే స్టేడియం అభివృద్ధి చెందుతుందని భావించిన సభ్యుల కలలు కల్లలుగానే మిగిలిపోయాయి. స్టేడియం నగరపాలక సంస్థకు చెందిన ఆస్తి. అంటే ప్రభుత్వానికి సొంతం. కొందరు వ్యక్తులు మాత్రం స్టేడియం తమదే అన్నట్లు వ్యవహరించడాన్ని పలువురు సభ్యులతోపాటు క్రీడాకారులు తప్పుబడుతున్నారు. ఇప్పటికైనా రాజకీయాలు ఆపి క్రీడలను ప్రోత్సహిస్తే మేలని ప్రజలు పేర్కొంటున్నారు.

ఆర్థిక సేవల్లో నిపుణుడు డాక్టర్ నాగరాజు మద్దిరాల

నేడు తెనాలిలో డాక్టర్ యలవర్తి నాయుడమ్మ అవార్డు స్వీకరణ



నాగరాజు మద్దిరాల

తెనాలి: ప్రసిద్ధ శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మ స్మారక అవార్డును ఈ పర్యాయం కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ పరిధిలోని ఆర్థిక సేవల విభాగం కార్యదర్శిగా చేస్తున్న ఐఏఎస్ అధికారి నాగరాజు మద్దిరాలకు బహూకరించనున్నారు. డాక్టర్ యలవర్తి నాయుడమ్మ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 4.30 గంటలకు తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఏర్పాటయే సభకు ఫౌండేషన్ చైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు అధ్యక్షత వహించారు. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతులమీదుగా నాగరాజు మద్దిరాలకు అవార్డును ప్రదానం చేస్తారు. ఇదే వేదికపై నాయుడమ్మపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేస్తారు.

తెలుగుతేజం

నాగరాజు మద్దిరాల ఆకివీడు దగ్గర్లోని ఆలపాడు గ్రామంలో 1966లో జన్మించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఆర్థికశాస్త్రంలో డిగ్రీ, హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో తత్వశాస్త్రంలో పీజీ కోర్సు చేశారు. 27 ఏళ్ల వయసులో త్రిపుర కేడర్‌లో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. అదే రాష్ట్రంలో వివిధ హోదాల్లో పనిచేశారు. ఆర్థిక, పరిశ్రమల, వాణిజ్యశాఖ కార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా వంటి కీలక పదవులు నిర్వహించారు. ఆయన హయాంలోనే 2016లో త్రిపుర, 'మోస్ట్ ఇంప్రూవ్ స్మాల్ స్టేట్ ఇన్ ఈ-గవర్నెన్స్'గా గుర్తింపును పొందింది. అదే సంవత్సరంలో రాష్ట్రంలో శిశు మరణాల రేటును 26 నుంచి 21కు తగ్గించినందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి త్రిపురకు రెండో బహుమతి లభించింది. 2004–08లో ఆర్థిక మంత్రిత్వశాఖ, ఆర్థిక వ్యవహారాల విభాగంలో జపాన్, ఉత్తర అమెరికా, ప్రపంచ బ్యాంక్ విభాగాల్లో డైరెక్టర్‌గానూ నాగరాజు చేశారు. 2008 – 12లో వాషింగ్టన్ డీసీలోని ప్రపంచ బ్యాంకుకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా, సలహాదారుగానూ వ్యవహరించారు. బొగ్గు మంత్రిత్వ శాఖలో సంయుక్త కార్యదర్శిగా, అదనపు కార్యదర్శిగా వినూత్న సంస్కరణలను ప్రవేశపెట్టారు. ఒక బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి అనే చారిత్రక మైలురాయిని చేరుకునేలా చేశారు. ప్రస్తుతం ఆర్థిక సేవలశాఖ కార్యదర్శిగా ఆ రంగ బలోపేతానికి కృషి చేస్తున్నారు.

డాక్టర్ జగదీష్‌రెడ్డికి బంగారు పతకం



గవర్నర్ నుంచి పతకం స్వీకరిస్తున్న జగదీష్‌రెడ్డి

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ న్యూరో సర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉయ్యూరు జగదీష్ రెడ్డికి గోల్డ్‌మెడల్ లభించింది. మంగళవారం విజయవాడలో జరిగిన ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ 27వ స్నాతకోత్సవంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ప్రొఫెసర్ ఎం.ఆర్.సి.నాయుడు గోల్డ్ మెడల్, ప్రశంసా పత్రాన్ని డాక్టర్ జగదీష్‌రెడ్డి స్వీకరించారు. డాక్టర్ జగదీష్‌రెడ్డి గుంటూరు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్, కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలలో న్యూరో సర్జరీలో సూపర్‌స్పెషాలిటీ పీజీ అభ్యసించారు. పీజీ కోర్సులో యూనివర్సిటీ స్థాయిలో అత్యధిక మార్కులు సాధించినందుకు గోల్డ్ మెడల్ లభించింది. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి, న్యూరో సర్జరీ వైద్య విభాగాధిపతి డాక్టర్ సత్యనారాయణమూర్తి, పలువురు న్యూరో సర్జన్లు ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపారు.